# సత్యవాక్యం

# The Word of Truth

క్రైస్తవ మాసపత్రిక

FEBRUARY - 1998

## సంక్షిప్త వార్తలు

1998 జనవరి మొదటి తేదీ ఉదయం జాషువా గూటం గారి కుమారులు జాన్‌రికీ, సేమ్యూల్ రోనీ గార్లు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. వారితోబాటు ఆరోజు కాకినాడ స్థానిక క్రీస్తు సంఘమునకు హాజరగుచున్న మరి ముగ్గురుకూడా క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. వీరందరికీ నెహెమ్యా గూటం గారు బాప్తిస్మమిచ్చిరి.

1998 జనవరి మొదటి తేదీ ఉదయం 11 గంటలకు తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం దొడ్డిగుంట గ్రామములో స్థానిక క్రీస్తు సంఘము నిర్మించుకొనిన చక్కటి ఆలయము క్రీస్తు సేవకొరకు ప్రతిష్టింపబడెను. దొడ్డిగుంటలో మొదట సహో జాన్ ఫ్రెడరిక్ గారు, అటు తరువాత ఆయన కుమారుడు క్రిస్టాఫర్ ఫ్లెమింగ్స్ గారు క్రీస్తు సువార్త చాటుచు వచ్చారు. దొడ్డిగుంట ఆలయమును స్థానిక సభ్యులు తమ స్వయంకృషి హస్తాలతో పది సంవత్సరములకు పైగా శ్రమించి నిర్మించారు. ఆ ఆలయమును జాషువా గూటం గారు రిబ్బను కత్తిరించి తెరచి, క్లుప్తముగా వాక్యపరిచర్య చేసారు. జాషువా గారి కుటుంబ సభ్యులు అందరు, ఫ్లెమింగ్స్ గారి కుటుంబ సభ్యులందరు పరిసర ప్రాంతములనుండి వచ్చిన వందలాది క్రైస్తవులతో కలిసి అత్యానందముతో దేవుని స్తుతించారు, ఘనపరిచారు. ఆలయ నిర్మాణములో ఎనలేని కృషిచేసి ఆర్థికవనరుల సమీకరణలో సహాయపడిన జాషువా గూటం గారికి స్థానిక సంఘము తరపున ఫ్లెమింగ్స్ గారు వందన సమర్పణ గావించారు. తదనంతరము క్రీస్తులోనికి ఇద్దరు బాప్తిస్మము పొందారు. వచ్చినవారందరికీ, గ్రామస్థులకు దొడ్డిగుంట క్రీస్తుసంఘము ప్రేమ విందు యిచ్చారు.

జనవరి రెండవతేదీ రాత్రి విశాఖ జిల్లా చోడవరంలో పనిచేయుచున్న సోదరులు యం. ప్రసంగిగారు ప్రభువునందు నిద్రించారు. ప్రసంగిగారు మంచి బోధకులే గాక చక్కటి గాయకులు కూడాను. ఆయన చోడవరం, దామునాపల్లి, తుమ్మపాల, రాజాం గ్రామములలోను, పరిసర ప్రాంతములలోను వాక్యపరిచర్య చేయుచు క్రీస్తు సంఘములను స్థాపించారు. 16వ తేదీనాడు చోడవరంలో స్మారక కూటము జరిగెను. ఆయన విడిచి వెళ్ళిన భార్య బిడ్డల కొరకు, స్థానిక సంఘముల కొరకు ప్రార్థించుదాం.

1998 జనవరి 8వ తేదీనాడు అమెరికాలో సహో. పెర్రికోతమ్ గారి భార్య తెరీసాకోతమ్ గారు ప్రభువునందు నిద్రించారు. ఆమె అనేక సంవత్సరములుగా

# సత్యవాక్యం

## THE WORD OF TRUTH

**P.o. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884-63722**

**Editor :** **J.C.CHOATE**

**Managing Editor :** **JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 18 ఫిబ్రవరి 1998 సంచిక 7


## సంపాదకీయం

### బాప్తిస్మము ఎందుకు పొందవలెను ?

( Why be Baptized ? )

బాప్తిస్మము బైబిలు అంశమై యున్నది. క్రొత్త నిబంధన అంతటిలోను దానిని గూర్చి చెప్పబడి యున్నది; అది నీటి సమాధియని, నీటిలో ముంచబడుట యని నిర్వచింపబడినది (అపొ.కా. 8:36-39). అది తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మని యొక్కయు నామమున జరిగించబడవలెనని క్రీస్తు చెప్పెను. లేఖనములు దీనిని బోధించుచున్నను బాప్తిస్మము ప్రాముఖ్యము కాదనియు, రక్షణ నొందుటకు దాని అవుసరము లేదనియు చాలమంది నమ్మెదురు. ఈ అంశమును ఎత్తిన మరుక్షణములో అనేక ప్రశ్నలను వారు వేయుదురు. ఒకడు బాప్తిస్మము పొందవలెనా ? అట్లయితే ఎందుకు పొందవలెను ? అని అడుగు వారున్నారు. ఒకడు బాప్తిస్మము నెందుకు పొందవలెనో ఈ వ్యాసములో లేఖనము లలో నుండి జవాబు నిచ్చుటకు ప్రయత్నము చేయుదము.

1. బాప్తిస్మమును ప్రభువే ఆజ్ఞాపించెను గనుక ఒకడు బాప్తిస్మము

పొందవలెను. సర్వలోకమునకు సువార్త ప్రకటించుడి యని క్రీస్తు తన శిష్యుల కాజ్ఞాపించి, "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధించబడును" అని చెప్పెను (మార్కు 16:15,16). పేతురు కొర్నేలికి అతని యింటివారికి సువార్తను బోధించిన తరువాత వారు దేవునికి విధేయులగుటకు యిచ్ఛకలిగి యున్నారని గ్రహించి, "మనవలె పరిశుద్ధాత్మను పొందిన వీరు బాప్తిస్మము పొందకుండ ఎవడైనను నీళ్ళకు ఆటంకము చేయగలడా అని చెప్పి యేసుక్రీస్తు నామమందు వారు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను" (అపొ.కా. 10:47,48). ప్రభువు యిచ్చిన ఆజ్ఞలలో ఏదో ఒక దానికి లోబడకుండ ఒకడెట్లు రక్షింపబడగలడు?

2. ఒకడు రక్షింపబడు నిమిత్తము, పాపక్షమాపణ పొందు నిమిత్తము, తన పాపములు కడిగివేయబడు నిమిత్తము బాప్తిస్మము పొందవలెను. ఒకడు బాప్తిస్మము పొందునపుడేమి జరుగునో తెలియజేయుటకు అనేక భావములు (పదములు) వాడబడెను. అయితే ప్రతి సందర్భములోను దేవుని చిత్తమునకు లోబడువాడు రక్షింపబడు నిమిత్తము అతడు బాప్తిస్మము పొందినట్లు మనము చూడగలము. అపొ.పేతురు ఇట్లు వ్రాసెను: "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేదనగా శరీరమాలిన్యము తీసివేయుట కాదుగాని యేసుక్రీస్తు పునరుత్థానమూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షినిచ్చు ప్రత్యుత్తరమే" (1పేతురు 3:21). మరల అతడిట్లనెను: "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు (అపొ.కా. 2:38). అననీయ పౌలుతో యిట్లనెను: "గనుక నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగి వేసికొనుము" (అపొ.కా. 22:16). ఈ వచనములన్నిటిలోను చివర కలిగే ఫలితము రక్షణ అని నీవు చూడగలవు. బాప్తిస్మము ఒక్కటి మాత్రమే అవుసరమని ఈ వచనములు చెప్పుటలేదు. గాని మరికొన్ని సంగతులతో పాటు బాప్తిస్మము అవుసరమని చెప్పబడుట నీవు గమనించగలవు. ఇంకొక మాటలో బాప్తిస్మమొక్కటి

మాత్రమే యెవనిని రక్షించదు గాని ఒకడు దేవుని చిత్తమును విని, విశ్వసించి తన పాపముల విషయమై మారుమనస్సు పొంది, క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని బాప్తిస్మము పొందినప్పుడు అతని పాపములు క్షమించబడును, కడిగివేయబడును. దీనిని చేయకుండ యెవడైనను రక్షింపబడగలడను భావము లేఖనములను చదువుట వలన కలుగదు.

3. తిరిగి జన్మించుటకు బాప్తిస్మము అవసరము గనుక ఒకడు బాప్తిస్మము పొందవలెను. క్రీస్తు యిట్లనెను: "ఒకడు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడు" (యోహాను 3:5). క్రొత్తజన్మను గూర్చి ప్రభువు నీకొదేముతో సంభాషించు సరికి రాజ్యము లేక సంఘము ఇంకను స్థాపించబడలేదు, గాని అది త్వరలో స్థాపించబడ బోవుచున్నది. అది స్థాపించ బడినప్పుడు దానిలో ప్రవేశించుటకు ఆత్మమూలముగాను నీటి మూలముగాను జన్మించుట అవసరమని ప్రభువు చెప్పెను. మారుమనస్సు పొంది పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన వారిని ప్రభువు సంఘములో దినదినము చేర్చు చుండెనని తరువాత మనము కనుగొనగలము (అపొ.కా. 2:38; 2:47). ఇది బాప్తిస్మమును క్రొత్త జన్మతో కలుపుచున్నది. అయితే బాప్తిస్మము క్రొత్తజన్మలో ఒక భాగమెట్లగును ? ప్రభువు చెప్పిన దానిని మరల ఒకసారి చూడుము. దేవుని రాజ్యములో ప్రవేశింపవలెననిన ఒకడు ఆత్మమూలముగాను, నీటిమూలముగాను జన్మించవలెనని ఆయన చెప్పెను. ఈ వచనములో నీరు బాప్తిస్మమును సూచించు చున్నది. ఫిలిప్పు ఐతియోపీయ నపుంసకునికి నీటిలో బాప్తిస్మమిచ్చెను (అపొ.కా. 8:36-38). అనగా ఒకడు నీటిలో పాతిపెట్టబడి (కొలస్స 2:12) దానిలో నుండి వెడలివచ్చునపుడు అతడు జన్మించినవాడగును. అయితే ఆత్మద్వారా జన్మించుట యనగా నేమిటి ? నీటిద్వారా జన్మించుట ఆత్మయొక్క నడిపింపును బట్టి అనగా ఆత్మయొక్క మాటలగు లేఖనములను బట్టి జరిగించబడును. ఆ సమయమందు మన ఆత్మలను జీవింపజేయునట్లు ఆయాత్మ మనలో ప్రవేశించును. తద్వారా మనము పాపములో యున్నప్పుడు మృతులమై యున్నట్లుండక సజీవులుగా చేయబడుదుము పేతురు ఇట్లనెను: "మీరు సత్యమునకు విధేయులవుట చేత

మీ మనస్సులను పవిత్ర పరచుకొనిన వారై యుండి యొకనినొకడు హృదయ పూర్వకముగాను, మిక్కుటముగాను ప్రేమించుడి" (1పేతురు 1:23). గనుక లేఖనముల ప్రకారము బాప్తిస్మము పొందినవారు తిరిగి జన్మించినవారు ; వారు ప్రభువు కుటుంబసభ్యులు, ఆయన సంఘసభ్యులు గాని లేఖనముల ప్రకారము బాప్తిస్మము పొందనివారు తిరిగి జన్మించిన వారు కారు గనుక వారింకను తమ పాపములలోనే యున్నారు.

4. ఒకడు క్రీస్తులోనికి ప్రవేశించుటకు బాప్తిస్మము పొందవలెను. క్రీస్తులోనికి ప్రవేశించుటకు ఒకే ఒక్క మార్గమున్నదని లేఖనములు చెప్పుచున్నవి. అది బాప్తిస్మమను మార్గము. బాప్తిస్మమొక్క దానిని గూర్చియే ఇక్కడ మనము మాటలాడుట లేదు గాని విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకోలుతో కలసియున్న బాప్తిస్మమును గూర్చి మాట్లాడుచున్నాము. ప్రభువు బోధను బట్టి యున్న బాప్తిస్మమును గూర్చి, ఒకని ఈ లోకమునుండి క్రీస్తులోనికి ప్రవేశింపజేయు ఆఖరిమెట్టగు దానిని గూర్చి మనము మాట్లాడుచున్నాము. ఈ బాప్తిస్మము ఒకని క్రీస్తులోనికి ప్రవేశపెట్టును. క్రీస్తులోనికి ప్రవేశించు వేరొక మార్గము ఏదియును లేదు. పౌలు ఇట్లు వ్రాసెను: "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:26,27). "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?" యని అతడు మరల వ్రాసెను (రోమా 6:3). "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతనసృష్టి: పాతవి గతించెను,ఇదిగో క్రొత్త వాయెను" (2కొరింథీ 5:17). ఒకడు క్రీస్తులో ఉన్నయెడల అతడు నూతనసృష్టి యని నీవు ఇక్కడ గమనించగలవు. అయితే ఒకడు నూతనసృష్టి యెట్లగును? ఇది ఇంతకుముందు యోహాను 3:5లో చదివినట్టి క్రొత్త జన్మలో సంభవించును. ఇదంతయు బాప్తిస్మము ద్వారా సంభవించునని మనస్సునందుంచు కొనుము. యెవడైనను బాప్తిస్మము లేకయే రక్షింపబడితినని చెప్పుకొనుచుండిన యెడల, అతడు క్రీస్తునకు వెలుపల క్రీస్తు లేకయే రక్షింపబడితినని చెప్పుకొనుచున్నాడు. ఏలయనగా క్రీస్తులోనికి ప్రవేశించుటకు ఒకడు బాప్తిస్మము పొందవలెనని బైబిలు

బోధించుచున్నది. క్రీస్తులో రక్షణ యున్నయెడల ఆయనకు వెలుపల రక్షణలేదనునది తేటగా యున్నది. యిది మరల బాప్తిస్మము యొక్క ప్రాముఖ్యతను మనకు చూపించు చున్నది.

5. ఒకడు సంఘములో ప్రవేశించుటకు బాప్తిస్మము పొందవలెను. అపొ.పౌలు ఇట్లనెను: "మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి" (1కొరింథీ 12:13). మన మందరము ఒక్క శరీరములోనికి బాప్తిస్మము పొందితిమని ఈ లేఖకుడు చెప్పుచున్నదానిని గమనించుము. అయితే ఆ శరీర మేమిటి? ఆ శరీరము సంఘము. ఒకే ఒక్క శరీరమున్నదని అదే లేఖకుడు చెప్పు చున్నాడు (ఎఫెసీ 4:4). ఆ శరీరమే సంఘము (కొలస్స 1:18). లేక సంఘమే ఆ శరీరము (ఎఫెసీ 1:22, 23). 1కొరింథీ 12వ అధ్యాయములో శరీరమును గూర్చి అతడనేకసార్లు వ్రాసెను గాని 12:27లో అతడు క్రీస్తు శరీరమును గూర్చి వ్రాసెను. శరీరమే సంఘమైయున్న యెడల అతడు క్రీస్తు సంఘమును గూర్చి మాట్లాడు చున్నాడు. అయితే ఒకడు సంఘములోనికెట్లు ప్రవేశించును ? మార్కు 16:16లో నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని క్రీస్తు చెప్పెను. మరియు అపొ.కా. 2:47లో ఈ రక్షింపబడినవారిని ఒకే ఆత్మద్వారా ఒకే శరీరములోనికి బాప్తిస్మము పొందితిమని పౌలు చెప్పెను. పరిశుద్ధాత్ముడు మనకు వాక్యమును అనగా క్రొత్తనిబంధనను యిచ్చెను గనుక, మనమా వాక్యమునకు లోబడినప్పుడు, ఆత్మ యిచ్చిన నడిపింపును బట్టి మనము ఒకే సంఘములోనికి బాప్తిస్మము పొందితిమి. ఎవరైతే ప్రభువు చిత్తమునకు లోబడి వాక్యప్రకారము బాప్తిస్మము పొందారో వారు ప్రభువు సంఘసభ్యులు, యెవరు దానిని జరిగించుటకు నిరాకరింతురో వారు క్రీస్తుకు ఆయన సంఘముకు వెలుపల యుండి నశింతురు. ఒకడు దేవుని వాక్యమును బట్టి నడిపించబడగోరుచున్న యెడల అతడు గ్రహించుకొను సంగతి యిదే.

బాప్తిస్మము పొందుటకు యింకా అనేక కారణములను చూపించవచ్చును. అయితే బాప్తిస్మము అవుసరమని అది రక్షింపబడుట కవుసరమని నమ్మకము

కలుగ జేయుటకు సరిపడినంత ఈ వాక్యములో చెప్పబడి యున్నది. ఒకడు ప్రభువునకు లోబడకుండ తాను రక్షింపబడితినని, క్రీస్తునందున్నానని, ఆయన సంఘమందున్నానని యెట్లు చెప్పగలడు ? ఈ సంగతులు అట్లున్నవో లేవో యని తెలిసికొనుటకు నీవు దేవుని వాక్యమును పరిశోధించి కనుగొనుము. నీవట్లు చేసి, ఈ యంశముపై దేవుని కోరికను గ్రహించుకొనినప్పుడు ఆయన చెప్పిన రీతిగ నీవు తప్పకుండ బాప్తిస్మము పొందెదవు.

## రెండవ మరణము

### ( The Second Death )

"ఒకడు నామాట గైకొనిన యెడల వాడెన్నడును మరణము పొందడు" యని క్రీస్తు బోధించెను (యోహాను 8:51). మీరేల నా మాటలు గ్రహింపకున్నారు? మీరు నా మాట విననేరకుండుట వలననే గదా ? మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు; మీ తండ్రి దురాశలు నెరవేర్పగోరుచున్నారు. ఆదినుండి వాడు నరహంతకుడై యుండి సత్యమందు నిలిచినవాడు కాడు; వానియందు సత్యమే లేదు; వాడు అబద్ధమాడునప్పుడు తన స్వభావము ననుసరించియే మాటలాడును; వాడు అబద్ధికుడును; అబద్ధమునకు జనకుడునై యున్నాడు (యోహాను 8:43,44). క్రీస్తు మాటకు లోబడువాడు మరణములో నుండి జీవములో ప్రవేశించును గాని సాతానుని మాటకు లోబడువాడు ఆ జీవమును పొందక మరణమును పొందును. శారీరక మరణమును గూర్చి కాదు గాని ఆత్మీయ మరణమును గూర్చి క్రీస్తు మాట్లాడుచున్నట్లు మనకు విదితమే.

అట్లయితే ఒకడు ఈఆత్మీయ మరణోగ్రతకు ఎట్లు గురియౌను? పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును; ఆజ్ఞాతి క్రమమే పాపము" (1యోహాను 3:4). గనుక ప్రభువు మాటలను అతిక్రమించు ప్రతివాడునుమరణము నొందును. "పాపము చేయని వాడు ఒకడును లేడు" (1రాజులు 8:46). "పాపము చేయక మేలు చేయుచుండు నీతిమంతుడు భూమిమీద ఒకడైనను లేడు"

(ప్రసంగి 7:20). "ప్రతివాడు నడినెత్తిని వ్యాధి కలిగియున్నాడు" (యెషయా 1:5). నేను దేశమును పాడు చేయకుండునట్లు ప్రాకారమును దిట్టపరచుటకును, బద్దలైన సందులలో నిలుచుటకును తగిన 'వాడెవడని' నేను ఎంత విచారించినను ఒకడైనను నాకు కనబడలేదు. (యెహెజ్కేలు 22:30). యెరూషలేము వీధులలో అటు యిటు పరుగెత్తుచు చూచి తెలుసుకొనుడి; దాని రాజవీధులలో విచారణ చేయుడి; న్యాయము జరిగించుచు నమ్మకముగా యుండ యత్నించుచున్న 'ఒకడు' నాకు కనబడిన యెడల నేను వానిని క్షమించుదును (యిర్మీయా 5:1). భక్తుడు "దేశములో లేకపోయెను, జనులలో యథార్థపరుడు ఒకడును లేడు, అందరును ప్రాణహాని చేయుటకై పొంచి యుండువారే. ప్రతి మనుష్యుడు కిరాతకుడై తన సహోదరుని కొరకు వలలు ఒగ్గును" (మీకా 7:2). నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు (రోమా 3:11). అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు (రోమా 3:23). అందువలననే "పాపములను తీసివేయుటకు క్రీస్తు ప్రత్యక్షమాయెను" (1యోహాను 3:5). ఆయన వలననే మరణవిముక్తి కలుగును.

పాపము చేయువాడెవడో వాడే మరణము నొందును (యెహెజ్కేలు 18:4). కుమారుల దోషమును బట్టి తండ్రులకు మరణశిక్ష విధింపకూడదు. ఎవని పాపము నిమిత్తము వాడే మరణశిక్ష నొందును (ద్వితీ 24:16). మొదటి నిబంధన కాలములో పాపము చేసినవారు మరణశిక్షకు పాత్రులై యుండేవారు. అట్టివారిని రాళ్ళతో కొట్టిగాని, శిరచ్ఛేదన చేయుటవలనగాని, అగ్నిలో దహించుటచేత గాని, మ్రానుపై వ్రేలాడదీయుట వలన గాని ఆ దోషమునకు శిక్ష విధించి చంపెడివారు. ఆ చట్టము భౌతికముగా చంపుట మాత్రమే గాక ఆత్మీయ మరణమునకు వారిని అప్పగించెడిది.

గాని నేటి క్రొత్త చట్టము ఏ మానవునికూడా భౌతికముగ చంపుటకు అనుమతి నిచ్చుట లేదు. "పాపమువలన వచ్చు జీతము మరణము" (రోమా 6:23). "ఆయన ప్రతివానికిని వానివాని క్రియల చొప్పున ప్రతిఫలమిచ్చును"

(రోమా 2:6). ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నాను. వానివాని క్రియల చొప్పున ప్రతివాని కిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నాయొద్ద ఉన్నది (ప్రకటన 22:12). నేడు మనము పాపము చేసినచో ఆ దోషమునకు శిక్ష శీఘ్రముగా రాక పోయినను దానియొక్క జీతము మాత్రము మనకొరకు వేచియుండును. "కొందరి పాపములు తేటగా బయలుపడి న్యాయపు తీర్పునకు ముందుగా నడుచుచున్నవి. మరికొందరి పాపములు వారివెంట వెళ్లు చున్నవి" (1తిమోతి 5:23).

పిరికివారును, అవిశ్వాసులును ( క్రైస్తవులు కానివారును, క్రైస్తవులై విశ్వాస భ్రష్టులైనవారు), అబద్ధికులందరును (అబద్ధము లాడువారు, అబద్ధబోధలు చేయు వారు) అగ్ని గంధకములతో మండు గుండములో పాలుపొందుదురు; ఇది రెండవ మరణము ప్రకటన 21:8,22:15). నరకములో పాలు పొందువారి జాబితాను మనము గమనించినట్లైతే, పాపములో హెచ్చుతగ్గులు లేవనియు, అబద్ధికుడును నరహంతకుడును నరకమునకు పాత్రులేననియు తెలిసికొనగల్గుచున్నాము. పాపము వలన వచ్చు జీతము మరణము. ఇది దేవునికిని పాపికిని మధ్య కలుగు నిత్యమైన వియోగము.

"నీతిమంతుడే రక్షింపబడుట దుర్లభమైతే భక్తిహీనుడును, పాపియు ఎక్కడ నిలుతురు ?" (1పేతురు 4:18). పాపము చేయుచు యుండువాడే పాపి. ఒకడు రక్షింపబడిన తరువాత పరిశుద్ధతను సంపూర్తి చేసికొనుటకు మానివేసి, పాపసంబంధ మైన క్రియలనే చేయుచున్నట్లయితే అతడు పాపిగా యెంచబడును. "అమూల్యమైన రక్తము చేత అనగా నిర్దోషమును నిష్కళంకమునగు గొర్రెపిల్లవంటి క్రీస్తు రక్తముచేత, విమోచింపబడితిరని మీరెరుగుదురు గదా ? (1పేతురు 1:19). గనుకనే ప్రతి క్రైస్తవుడు పరిశుద్ధుడని పిలువబడెను (2కొరింథీ 9:1). "నేను పరిశుద్ధుడనై యున్నాను గనుక మీరును పరిశుద్ధులైయుండుడని వ్రాయబడి యున్నది కాగా మీరు విధేయులగు పిల్లలై, మీ పూర్వపు అజ్ఞానదశలో మీకుండిన ఆశల ననుసరించి ప్రవర్తింపక, మిమ్మును పిలిచినవాడు పరిశుద్ధుడై యున్న ప్రకారము మీరు ను సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులై యుండుడి" (1పేతురు 1:14-16).

"మనము పాపము చేయలేదని చెప్పుకొనిన ఎడల, ఆయనను అబద్ధకునిగా చేయువార మగుదుము; మరియు ఆయన వాక్యము మనలో ఉండదు" (1యోహాను 1:10). ఈ వాక్యమును వ్రాయుటవలన అపొస్తలుడైన యోహానుకూడా-నేను పాపము చేయకుండా యుండుటలేదని ఒప్పుకొనుచున్నాడు. అంత మాత్రమున అతనియొక్క పవిత్రత దెబ్బ తినకుండు నిమిత్తము, ఆ పాప విషయములలో మారుమనస్సు పొందినాడు గనుక అతడు పరిశుద్ధుడే.

గాని కొందరు తమ పరిశుద్ధతను వదలుకొని విశ్వాస భ్రష్టులైనట్లు పేతురు చెప్పుచున్నాడు: "వారు ప్రభువును మన రక్షకుడైన యేసుక్రీస్తు విషయమై అనుభవ జ్ఞానముచేత ఈ లోకమాలిన్యములను తప్పించుకొనిన తరువాత మరల వాటిలో చిక్కుపడి వాటిచేత జయింపబడిన యెడల వారి కడవరి స్థితి మొదటిస్థితి కంటె మరిచెడ్డదగును" (2పేతురు 2:20). అట్టివానికిని అన్యునికిని ఏ భేదము లేదు. వానియొక్క పాపపు అభ్యాసమే వానిని రెండవ మరణమునకు అప్పగించును. ఈ విధముగా ఆ పాపపు జీవితమునకు పాత్రుడైనవాడు మరణకరమైన పాపమందు నిలిచియున్నాడు. "మరణకరమైన పాపము కలదు. అట్టిదానిని గూర్చి వేడుకొనవలెనని నేను చెప్పుటలేదు" (1యోహాను 5:16). ఉదా: "అట్టి మనస్సాక్షిని కొందరు త్రోసివేసి, విశ్వాస విషయమై ఓడ బద్దలై పోయిన వారివలె చెడియున్నారు. వారిలో హుమెనైయును అలెక్సంద్రును ఉన్నారు; వీరు దూషింపబడకుండ శిక్షింప బడుటకై వీరిని సాతానుకు అప్పగించితిని" (1తిమోతి 1:19,20). తప్పిపోయినవారు తమ విషయములో దేవుని కుమారుని సిలువ వేయుచు బాహాటముగా ఆయనను అవమానపరచు చున్నారు. గనుక మారుమనస్సు పొందునట్లు అట్టివారిని మరల నూతనపరచుట అసాధ్యము (హెబ్రీ 6:6).

సకల దుర్నీతియు పాపము; అయితే మరణకరము కాని పాపము కలదు" (1యోహాను 5:17). తన సహోదరుడు మరణకరము కాని పాపము చేయగా ఎవడైనను చూచిన యెడల అతడు వేడుకొనును; అతనిబట్టి దేవుడు మరణకరము కాని పాపము చేసినవానికి జీవము దయచేయును (1యోహాను

5:16). ఒకడు క్రీస్తు అనుగ్రహించు జీవములోనుండి తొలగిపోయి, తన తప్పును గుర్తించి క్రీస్తును వేడుకొనిన యెడల వాడు మరల ఆ పరిశుద్ధత నొందినట్లే. సహోదరులారా, ఒకడు ఏ తప్పిదము లోనైనను చిక్కుకొనిన యెడల ఆత్మ సంబంధులైన మీలో ప్రతివాడు తానును శోధింపబడుదునేమో అని తన విషయమై చూచుకొనుచు, సాత్వికమైన మనస్సుతో అట్టి వానిని మంచిదారికి తీసుకొని రావలెను (గలతీ 6:1). నా సహోదరులారా, మీలో ఎవడైనను సత్యమునుండి తొలగిపోయినప్పుడు మరియొకడు అతనిని సత్యమునకు మళ్ళించిన యెడల, పాపిని వాని తప్పు మార్గమునుండి మళ్ళించువాడు 'మరణము' నుండి యొకఆత్మను రక్షించి అనేక పాపములను కప్పివేయునని తాను తెలిసికొనవలెను యాకోబు 5:19,20). అగ్నిలోనుండి లాగినట్టు కొందరిని రక్షించుడి, శరీర సంబంధమైన అపవిత్ర ప్రవర్తనకు ఏ మాత్రమునొప్పుకొనక దానిని అసహ్యించు కొనుచు భయముతో కొందరిని కరుణించుడి (యూదా :23). ఈ విధముగా పరిశుద్ధుడు పాపములో పడిన తరువాత పునరుద్ధరింపబడినట్లయితే వాడు మందుచేసిన పాపము వానికి మరణకరము కాదు. "వారి పాపములను వారి అతి క్రమమలను ఇకను ఎన్నటికిని జ్ఞాపకము చేసికొనను అని ప్రభువు చెప్పుచున్నాడు" (హెబ్రీ 10:17). "తన అతిక్రమములకు పరిహారము నొందినవాడు, తన పాపమునకు ప్రాయశ్చిత్తము నొందిన వాడు ధన్యుడు. ప్రభువు చేత నిర్దోషియని ఎంచబడిన వాడు ధన్యుడు" (ర మా 4:7,8). ఆ పూర్వపు పాపమంతయు కొట్టివేయబడి యిక వానిపై నిలిచి యుండదు. గనుక అది మరణకరముకాని పాపముగా పరిగణింప బడదు.

"మీలో ఎవడైనను దేవుని కృపను పొందకుండ తప్పిపోవునేమో అనియు, చేదైన వేరు ఏదైనను మొలచి కలవర పరచుటవలన అనేకులు అపవిత్రులై పోవుదురేమో అనియు, ఒక పూట కూటి కొరకు తన జ్యేష్ఠత్వపు హక్కును అమ్మి వేసిన ఏశావువంటి భ్రష్టుడైనను వ్యభిచారియైనను ఉండునేమో అనియు జాగ్రత్తగా చూచుకొనుడి" (హెబ్రీ 12:15,16). సహోదరులారా, జీవము గల దేవుని విడిచి

పోవునట్టి విశ్వాసములేని దుష్టహృదయము మీలో ఎవనియందైనను ఒకవేళ ఉండునేమో అని జాగ్రత్తగా చూచుకొనుడి. పాపము వలన కలుగు భ్రమచేత మీలో ఎవడును కఠినపరచబడ కుండునట్లు నేడు అనబడు సమయముండగానే, ప్రతిదినము ఒకనినొకడు బుద్ధిచెప్పుకొనుడి (హెబ్రీ 3:12-15).మీరు శరీరానుసారముగా ప్రవర్తించిన యెడల చావవలసినవారై యుందురుగాని ఆత్మచేత శారీరక క్రియలను చంపినయెడల జీవించెదరు (రోమా 8:13).

"క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షావిధియు లేదు" (రోమా 8:1). అట్టివారికి రెండవ మరణముపై విజయము కలుగును. నీవు రెండవ మరణమును జయింపగోరి, దేవునితో నిత్యము నివసింపగోరుచున్నావా ? అట్లయితే నేడే ఆయన యందు జీవించుటకు నిర్ణయించుకొనుము. అప్పుడు నీ ఆత్మ నీతి విషయమై జీవము కలిగి యుండును.

- S. ప్రభుదాస్

## ఆశ్చర్యకరుడైన క్రీస్తు
## ( The Wonderful Christ )

క్రీస్తు పుట్టడానికి 700 వందల సంవత్సరముల ముందే యెషయా ప్రవక్త ఇట్లు ప్రవచించాడు: "ఏలయనగా మనకు శిశువు పుట్టెను, మనకు కుమారుడు అనుగ్రహించబడెను. ఆయన భుజముమీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు. నిత్యుడగు తండ్రి సమాధాన కర్తయగు అధిపతి యని అతనికి పేరు పెట్టబడును" (యెషయా 9:6). యెషయా ప్రవచించిన క్రీస్తు ఆశ్చర్యకరుడు. ఆయనను గూర్చి ఈరోజు కొంత తెలిసికొందము.

యేసుక్రీస్తు ఆశ్చర్యకరుడు. ఏ మానవుడు జన్మించని విధంగా ఆయన ఈలోకమందు జన్మించాడు. దేవుని ప్రభావమువలన ఆయన కన్యయైన మరియకు జన్మించాడు. యేసుకు భూసంబంధమైన తండ్రిలేడు. దేవుడే ఆయన తండ్రి.

అందువలన ఆయన దేవుని అద్వితీయ కుమారుడు. ఆయన ఆశ్చర్యకరుడు. దైవమానవుడు, మానవుల దేవుడు.

యేసుప్రభువు దేవుని కుమారుడే కాదు, ఆయన మనుష్యకుమారుడుకూడా. "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని" పేతురు ఆయనను గూర్చి ఒప్పుకొన్నాడు. (మత్తయి 16:16). యేసయితే తాను మనుష్యకుమారుడనని చెప్పుకొనేవాడు. "మనుష్యకుమారుడు పరచారము చేయించు కొనుటకు రాలేదు గాని పరాచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణమును ఇచ్చుటకును వచ్చెను" అని తన్ను గూర్చి ఆయన చెప్పాడు (మ ర్కు 10:45).

యేసుప్రభువు ఆశ్చర్యకరమైన శక్తిమంతుడు. ఆయన గ్రుడ్డివారిని బాగుచేసాడు. యేసును ఆయన శిష్యులను బేత్సయిదాకు వచ్చారు. "అప్పుడు అక్కడివారు ఆయన యొద్దకు ఒక గ్రుడ్డివానిని తోడుకొనివచ్చి, వానిని ముట్టవలెనని ఆయనను వేడుకొనిరి. ఆయన గ్రుడ్డివాని చెయ్యి పట్టుకొని ఊరు వెలుపలికి తోడుకొనిపోయి, వా ని కన్నులమీద ఉమ్మివేసి, వానిమీద చేతులుంచి నీకేమైనను కనబడుచున్నదా? యని వానినడుగగా వాడు కన్నులెత్తి మనుష్యులు నాకు కనబడుచున్నారు.; వారు చెట్లవలె నుండి నడ చుచున్నట్లుగా నాకు కనబడు చున్నారనెను; అంతట ఆయన మరల తన చేతులు వాని కన్నులమీద నుంచగా వాడు తేరిచూచి కుదర్చబడి సమస్తమును తేటగ చూడసాగెను" (మార్కు 8:22-25).

యేసుప్రభువు చనిపోయిన వారిని ప్రాణాలతో లేవదీసాడు. సమాజ మందిరపు అధికారియైన యాయీరనునతని పండ్రెండు సంవత్సరముల ప్రాయముగల కుమార్తె చనిపోయెను. యేసు ఆ చిన్నదాని తలిదండ్రులను, తనతో ఉన్నవారిని వెంటబెట్టుకొని, ఆ చిన్నది పరుండియున్న గదిలోనికి వెళ్ళి ఆ చిన్నదాని చెయ్యిపట్టి చిన్నదానా, లెమ్మని చెప్పెను. వెంటనే ఆ చిన్నది లేచి నడవసాగెను (మార్కు 5:35-42).

యేసుప్రభువు తన శిష్యులతో కలసి ఒక చిన్న దోనెలో ప్రయాణము చేయుచుండగా పెద్దతుపాను రేగింది. అప్పుడాయన లేచి గాలిని గద్దించి, నిశ్శబ్దమై ఊరకుండుమని సముద్రముతో చెప్పగా, గాలి అణగి మిక్కిలి నిమ్మళమాయెను. ఆయన శిష్యులు మిక్కిలి భయపడి, ఈయన ఎవరో -గాలియు, సముద్రమును ఈయనకు లోబడుచున్నవని యొకనితో ఒకడు చెప్పుకొన్నారు. (మార్కు 4:35-41).

యేసుక్రీసు ఆశ్చర్యకరమైన మాటలను పలికాడు. "ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది. దుఃఖపడువారు ధన్యులు; వారు ఓదార్చబడుదురు. సాత్వికులు ధన్యులు,;వారుభూలోకమును స్వతంత్రించుకొందురు. నీతికొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు; వారు కనికరము పొందుదురు. హృదయ శుద్ధిగలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు. సమాధానపరచువారు ధన్యులు వారు దేవుని కుమారులనబడుదురు. నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు; పరలోకరాజ్యము వారిది" యని యేసుప్రభువు బోధించాడు. మరియు "ఏమి తిందుమో ఏమి త్రాగుదయో యని మీ ప్రాణమును గూర్చియైనను ఏమి ధరించుకొందుమో యని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి; ఆహారముకంటె ప్రాణమును వస్త్రముకంటె దేహమును గొప్పవి కావా ? ... ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును" అని ఆయన బోధించాడు (మత్తయి 5,6,7 అధ్యాయాలు). "యేసు ఈ మాటలు చెప్పి ముగించినప్పుడు జనసమూహములు ఆయన బోధకు, ఆశ్చర్యపడుచుండిరి. ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలె గాక అధికారముగల దాని వలె వారికి బోధించాడు" (మత్తయి 7:28,29).

యేసుక్రీస్తుకు ఆశ్చర్యకరమైన అధికారమున్నది. అధికారముగల వానివలె ఆయన బోధించేవాడు., ప్రకృతి శక్తులు ఆయన అధికారమునకు లోబడేవి. అపవిత్రాత్మలు ఆయన అధికారమునకు భయపడి ఆయనకు లొంగేవి. చివరకు

మృత్యువును కూడా ఆయన్ని లొంగదీసాడు. ఆయన చనిపోయినవారికి తిరిగి ప్రాణం పోయుటయేగాక, ఆయనే చనిపోయి సజీవుడై తిరిగి లేచాడు. ఇది ఎంత ఆశ్చర్యమో! ఆయన మృత్యుంజయుడై లేచిన తరువాత, "పరలోకమందునుభూమి మీదను నాకు సర్వాధికారమీయబడి యున్నది. కాబట్టి మీరు వెళ్ళి సమస్తజనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామము లోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" యని తన అపొస్తలుల నాజ్ఞాపించాడు (మత్తయి 28:18-20).

యేసుక్రీస్తు ఇప్పుడు పరలోకమందొక ఆశ్చర్యస్థానాన్ని కలిగియున్నాడు. ఆయన పునరుత్థానుడైన తరువాత పరలోకమునకు ఆరోహణుడయ్యాడు. ఆయన దేవుని కుడి పార్శ్వమునకు హెచ్చింపబడ్డాడు. ఈ యేసును దేవుడు ప్రభువుగాను, క్రీస్తుగాను నియమించాడు. దీన్ని మీరందరూ రూఢిగా తెలిసికోవాలని అపొ.పేతురు ఉద్బోధించాడు (అపొ.కా. 2:31,36).

యేసుక్రీస్తు మరల రాబోవుచున్నాడు. ఆయన మొదట పాపులను రక్షించడానికి వచ్చాడు. రెండోసారి ఆయన పాపులకు తీర్పు తీర్చడానికి వస్తున్నాడు."ఇదిగో త్వరగా వచ్చుచున్నాను వాని వాని క్రియల చొప్పున ప్రతీవానికిచ్చుటకు నేను సిద్ధ పరచిన జీతము నాయొద్ద ఉన్నది" యని ఆయన చెప్పుచున్నాడు (ప్రక 22:12). ఆయనకు విధేయులై నడుచుకొన్నవారిని నిత్యానందములో ఆయన ప్రవేశింప జేస్తాడు. ఆయన కవిధేయులైన వారిని నిత్యాగ్నిలో శిక్షిస్తాడు. యేసుప్రభువు ఆశ్చర్యకరుడు, ఆయనయందు విశ్వాస ముంచండి, మీ పాపముల విషయమై మారుమనస్సు పొందండి. యేసే దేవుని కుమారుడని ఒప్పుకొనండి. పాపక్షమాపణ నిమిత్తం క్రీస్తులోనికి బాప్తిస్మం పొందండి. ఆయన సంఘంలో యుంటూ ఆశ్చర్యకరమైన క్రైస్తవ్యాన్ని రుచిచూడండి !!

- జాషువా గూటం.

# క్రీస్తు వధువు

## ( The Br de of Ch.ist )

క్రీస్తుకు సంఘము యెడల ఉన్న ప్రేమను వర్ణించుటకు గాను దేవుడు వివాహము నొక మాదిరిగా యెంచుకొనెను (ఎఫెసీ 5:22-33). ఇది క్రీస్తు యెడల సంఘమునకున్న సంబంధమును గూర్చిన మన యనుభవ జ్ఞానము పెంపారు చేయుటయే గాక, మానవ వివాహములో దేవుడు కోరుచున్న గుణమును సరిగ వ్యక్తపరచుచున్నది.

ప్రకటన 19:5-10లో గొర్రెపిల్ల యొక్కయు ఆయన వధువగు సంఘము యొక్కయు పెండ్లి విందు జరగుబోవుటను యోహాను చూచెను. ఈ లేఖన భాగమును దానిలో నుపయోగింపబడిన అలంకారమును మనము గ్రహించుకొన వలెనంటే, హెబ్రీయుల వివాహ సాంప్రదాయములను కొన్నింటిని తెలిసికొనవలెను.

మొదటిగా ప్రధానము (Betrothal ) జరుపబడును. దీనిలో సాక్షుల యెదుట పెండ్లి షరతులు అంగీకరించబడి నిర్ణయించబడును. అది జరిగినప్పుడు పెండ్లి కుమారుడు, అతని వధువు భార్య భర్తలని చట్టరీత్యా పరిగణింపబడుదురు. తరువాత పెండ్లి కాకముందు కొంతగడువుండును. ఈ సమయములో వరుడు తన కట్నము నిచ్చును. వధువయితే తన భర్తకొరకే సిద్ధపడి యుండును. గడువు అయిపోగానే పెండ్లి కుమారుడు పెండ్లి విందునకు కొనిపోవుటకు ఆమె యొద్దకు వచ్చును గనుక ఆమె సిద్ధపడి యుండును. సాధారణముగా ఈ పెండ్లి విందు పెండ్లి కుమారుని యింటి వద్దనే జరుగును.

### దేవుడు తన ప్రజలు

దేవునికి తన ప్రజలకు ఉన్న భార్యభర్తల సంబంధము పాతనిబంధనలో అనేకసార్లు మనకు కనబడును. దేవతార్చన చేయువారితో ఇశ్రాయేలు వేశ్యవలె ప్రవర్తించిన భార్యవలె వర్ణించబడెను. అయినను ఆమె యెడల యెహోవా తన

ప్రేమానురాగములను కనుబరచి తన వాగ్దానము యెడల నమ్మకముగా యుండెను (యిర్మియా 3; యెహెజ్కేలు 16; హోషేయ 1-3 అధ్యాయములు). అయితే ఈ చిహ్నము యొక్క సంపూర్ణ మహిమ క్రీస్తులోను, ఆయన సంఘములోను కనబడు చున్నది.

పాతనిబంధన కాలములో వలె మన రక్షకుడు తన పెండ్లి కుమార్తెను ఒకే ఒక్క జనాంగమునకు మితము చేయలేదు. ఏలయనగా దేవుడు లోకము నెంతో ప్రేమించెను. పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు దానిలోనికి వచ్చెను, ఆయన విధించిన వివాహషరతుల నంగీకరించువారందరికి ఆయన ఆహ్వానము వర్తించును. పాప మానవుడు ఆ షరతుల నంగీకరించవచ్చు లేదా తృణీకరించవచ్చు. బేరములాడే స్థితిలో మాత్రమతడులేడు (రోమా 3:9-18).

యేసు తన వధువు నుండి నమ్మకమైన విధేయతను కోరుచున్నాడు. ఆయన విధించినది మానసికాంగీకార మాత్రమైన విశ్వాసము కాదు గాని (యాకోబు 2:19), ప్రేమతో ప్రోద్బలము చేయబడి విధేయతతో మిళితమైన విశ్వాసము (యోహాను 14:15).

క్రీస్తు తన వధువు కొరకు సాధించిన దానినిబట్టి అట్టి విధేయత తగినది. అమెను తన స్వరక్తమిచ్చి ఆయన కొనెను (అపొ.కా. 20:28). పాపులయెడల దేవునికున్న ప్రేమనది నిరూపించుచున్నది. (రోమా 5:8). మరియు విశ్వాసులను నీతిమంతులుగా తీర్చు ఆయన యధార్థతనది నిరూపించుచున్నది (రోమా 3:25, 26). దీనిలో ఆయన మానవులను ధర్మశాస్త్రము యొక్క శాపమునుండి విడుదల చేసెను మరియు పాపాంధకారములో చిక్కుబడి యున్నవారిని సంపూర్ణ దేవుని సహవాస వెలుగులోనికి తర్జుమా చేసెను (2కొరింథీ 13:11; 1యోహాను 1:3).

## నీవు సిద్ధపడుము

పెండ్లి విందునకు పూర్వమున్న గడువులో క్రీస్తు ఆయన వధువు చట్టరీత్యా బంధింప బడినవారు. కొరింథీయులను పవిత్రురాలైన కన్యకగా క్రీస్తుకు సమర్పింప

వలెనని పౌలు యోచించెను గాని వారి స్వల్పానుభవము వలన అబద్ధ బోధకుల ననుసరించి తమ్ము్మను తాము అపవిత్రపరచుకొనే ప్రమాదములో యున్నారని పౌలు వారికి వివరించెను(2కొరింథీ 11:2-4). ఈ లోకములోనికి తిరిగిపోయి "జారత్వమును జరిగించువారు" క్రీస్తునుండి బొత్తిగా వేరు చేయబడుదురు (గలతీ 5:4; హెబ్రీ 10:26,27).

వధువు తన్నుతాను సిద్ధపరచుకొని యున్నట్లు తనదర్శనములో యోహాను చూచెను (ప్రక 19:7). ధరించుకొనుటకు గాను ఆమెకు తెల్లని వస్త్రము లీయబడెను. యివి పరిశుద్ధుల నీతిక్రియలు (ప్రకటన 7:13-17; 3:4-5). వీరు దేవుని సర్వాంగ కవచమును ధరించుకొని మంచి విశ్వాస పోరాటమును పోరాడిన విశ్వాసులు.

## శత్రువగు అపవాది

వధువు యొక్క శత్రువగు అపవాది గొఱ్ఱెపిల్లచే పరాజయమునొంది ఆమెను ప్రతి విధమగు మోసముచేతను, వంచనతోను అపవిత్రపరచవలెనని ఇప్పుడు ప్రయత్నము చేయుచున్నది. తన అబద్ధబోధకుల సైన్యమునుండి జారీచేయుచున్న అసత్య ఆహ్వానముల మూలముగా క్రీస్తుయొక్క నిజమైన ఆహ్వానమును ప్రజలు అందుకొనకుండా అది అభ్యంతర పెట్టుచున్నది. సాతానుడు వెలుగుదూత వేషము ధరించుకొనుచున్నాడని పౌలు హెచ్చరించుచున్నాడు (2కొరింథీ 11:14). యెవరిని మ్రింగుదునా అని గర్జించు సింహమువలె అతడు వెదుకుచు తిరుగు చున్నాడని పేతురు హెచ్చరించుచున్నాడు (1పేతురు 5:8). క్రీస్తు వధువు విశ్వాసములో నిలుకడగా యుంటేనే అపవాదిని ఎదిరించగలదు.

## పెండ్లి విందు

క్రీస్తు తిరిగి వచ్చునప్పుడు ఆయనతో వధువు ఆకాశ మండలములో కలసి కొన్నప్పుడు ప్రధానము యొక్క గడువు అంతమగును (1థె 4:17). అప్పుడు దైవ వ్యతిరేకులనందరిని దేవుడు శిక్షించి ఆయన సముఖమునునుండి వారిని నిత్య

నాశనములోనికి పొరద్రోలును (2థెస్స 1:5-10). పెండ్లివిందు జరుగు స్థలముయొక్క తలుపులు మూయబడును. అటు తరువాత దానిలో యెవరు ప్రవేశింపలేరు, దాని నుండి యెవరు బయటికి రాజాలరు. అతి సౌందర్య వధువుగా సిద్ధపడియున్న సంఘము, ఈ క్రొత్త యెరూషలేము తన సృష్టికర్తయు రక్షకుడైన ఆ మహదేవుని యొక్క నిత్యానందములో ప్రవేశించును.

## సంఘము యొక్క ఏకత్వము

( The oneness of the Church )

శరీరమొక్కటే, ఆత్మయు ఒక్కడే; ఆ ప్రకారమే మీ పిలుపు విషయమై యొక్కటే నిరీక్షణ యందుండుటకు పిలువబడితిరి" (ఎఫెసీ 4:4).

అమెరికాలో అంతరంగిక యుద్ధము (Civil war ) జరిగిన నాటినుండి సంవత్సరమునకు రెండు క్రొత్త డినామినేషనులుద్భవించుచున్నవి. ఇప్పుడు 400 కంటే పైగా అవి యున్నవి. సత్యమును కనుగొనాలని ఆసక్తి కలిగిన వారికిది బహు గలిబిలిగా యున్నది. అట్టి అసమైక్యత, విభజన పరలోకమునుండి కలిగినదా లేక మానవులనుండి కలిగినదా ? క్రీస్తు విభజింపబడి యున్నాడా ? దీనికి సంతోష దాయకమైన పరిష్కారమొకటి యున్నది. దేవుడనుమతించునది ఒకే ఒక్క సంఘమునో లేక అనేక మతశాఖలనో తెలిసికొనుటకు అనేకమంది ప్రజలుజ్ఞానము కలిగి బైబిలు పరిశుద్ధ పుటలను తిరుగ వేయుచున్నారు. పరిశుద్ధ బైబిలును ఆదికాండమునుండి ప్రకటన గ్రంథమువరకు సమీక్షించి చూచినయెడల ప్రభువు సంఘము యొక్క ఏకత్వమును గూర్చి ఈ దిగువ వాస్తవములు కనబడును:

### ప్రవచనములో ఒకే సంఘము

ప్రవక్తల ద్వారా ప్రభువు తన సంఘము యొక్క రాకడను గూర్చి ముందుగనే తెలియజేసెను. యెహోవా మందిరమని దానిని యెషయా వర్ణించెను (యెషయా 2:3). సంఘమును రాజ్యమని దానియేలు వివరించెను (దానియేలు 2:44) అది పరలోక రాజ్యమని బాప్తిస్మమిచ్చు యోహాను పలికెను (మత్తయి 3:1). దేవుడు తన

ప్రవక్తలద్వారా రాబోవు ఒకే ఒక్క సంఘమును గూర్చి పలికెను. ఆయన అబద్ధమాడ జాలడు (హెబ్రీ 6:18).

## వాగ్దానములో ఒకే సంఘము

యేసు "నా సంఘమును కట్టుదునని" అతి విపులముగా చెప్పెను (మత్తయి 16:18). ఒకే ఒక్క మందను గూర్చి ఒకే ఒక్క గొఱ్ఱెల కాపరిని గూర్చి యేసు చెప్పినప్పుడు ఒకే ఒక్క సంఘము యొక్క ప్రాముఖ్యతను ఆయన వక్కాణించెను (యోహాను 10:16). ఒకే ఒక్క సంఘముండునని మన రక్షకుడు తానే చెప్పెను.

## ప్రార్థనలో ఒకే సంఘము

ఆయనయందు విశ్వాసముంచు వారందరు ఏకమై యుండవలెనని క్రీస్తు ఆవేశపూరితుడై ప్రార్థించెను (యోహాను 17:20-23). ఆయన ప్రజలయొక్క ఐక్యత, ఏకత్వమువలన ఈ లోకము ఆయనయందు విశ్వాసముంచునని, దేవుని ప్రేమనది గుర్తెరుగునని ప్రభువు ఈ ప్రార్థనలో పేర్కొనెను. ఈనాడున్న అనేక డినామినేషన్లనను గూర్చి అనేకులు తెలివి తక్కువగా దేవునికి కృతజ్ఞత చెల్లింతురు. యేసుక్రీస్తు ప్రార్థనకది ఎంత వ్యతిరేకముగా యున్నదో!

## కొనుబడిలో ఒకే సంఘము

దేవుని పిల్లలను ఏకముగా సమకూర్చుటకు యేసు మృతిబొందెనని భక్తుడైన యోహాను రికార్డు చేసెను (యోహాను 11:52). యేసు తన స్వరక్తమిచ్చి సంఘమును కొనెను (అపో.కా. 20:28). ఒకే ఒక్క సంఘముండుటకు గాను అత్యధికమైన మూల్యము, దేవుని కుమారుని స్వరక్తము ఈయబడెను.

## స్థాపనలో ఒకే సంఘము

క్రీస్తుశకము 33వ సంవత్సరములో పెంతెకొస్తు దినమున సంఘము స్థాపింపబడినప్పుడది ఒకే ఒక్కటి యుండెను. సువార్త వ్యాప్తి చెందుచున్నప్పుడు

కూడ సంఘము, ఒకే విశ్వాసము, ఒకే పాలన పద్ధతి యుండెను. స్థానిక సంఘము లన్నిటిలోను ఒకే సిద్ధాంతము (బోధ) బోధింపబడుచు యుండేది (1కొరింథీ 4:17). క్రొత్త నిబంధనలో యున్న 21 ఉత్తరములలోను (పత్రికలలోను) ఒకే ఒక్క సంఘమును గూర్చి చెప్పబడెను. అప్పటినుండి కొన్ని శతాబ్దముల తరువాతనే విభజనలు కలిగెను, మానవకల్పిత డినామినేషన్లు ఆరంభమాయెను.

## సారూప్యములో ఒకే సంఘము

సంఘమును గూర్చి మానవులు విపులముగా తెలిసికొను నిమత్తము బైబిలులో దేవుడు దానిని అనేక సారూప్యములతో వివరించెను. అది రాజ్యమని, శరీరమని, గృహమని, మందిరమని, ద్రాక్షతోటయని, క్రీస్తు పెండ్లి కుమార్తెయని చెప్పబడినది. క్రీస్తుకు వివిధనామములు గల అనేక వధువులున్నారని చెప్పుట ఎంత అసభ్యకరముగా యుండునోగదా! అయితే సంఘము క్రీస్తు యొక్క వధువని బైబిలు బోధించుచున్నది (ఎఫెసీ 5:23-32). అంతేకాకుండ, సంఘము క్రీస్తు యొక్క శరీరమని దేవుని వాక్యము చెప్పుచున్నది (కొలస్స 1:18-23). సరిగదా ఒకే ఒక్క శరీరమున్నదని కూడ అది చెప్పుచున్నది (ఎఫెసీ 4:4-6), ఈఒక్కొక్క సారూప్యములో ఒకే సంఘము చిత్రీకరించబడి యున్నది.

## ఐక్యతలో ఒకే సంఘము

క్రైస్తవులు ఏకమనస్కులై యుండవలెను (ఫిలిప్పీ 2:2). వారిలో కక్షలు ఏమియు ఉండరాదు (1కొరింథీ 1:10).

## విభజింపబడిన గృహము

క్రీస్తురాజ్యవ్యాప్తికి విభజన శత్రువు వంటిది. "ఒక రాజ్యము తనకు తానే విరోధముగా వేరుపడిన యెడల, ఆ రాజ్యము నిలువనేరదు. ఒక యిల్లు తనకు తానే విరోధముగా వేరుపడిన యెడల, ఆ యిల్లు నిలువనేరదు" అని మన రక్షకుడు బోధించెను (మార్కు 3:24,25).

క్రొత్తనిబంధన ఏకైక మార్గదర్శియై యుండగా విశ్వాసులందరు క్రీస్తు ప్రభువు సంఘములో ఏకమై యుండుట సాధ్యమే. అందరిని క్రీస్తులో ఏకముచేయు నిమత్తము, ఈ తరమువారికి క్రొత్త నిబంధన క్రైస్తవ్యమును అందజేయు నిమిత్తము క్రీస్తు సంఘసభ్యులు సమర్పించుకొని యున్నారు. క్రీస్తు సంఘారాధన లన్నిటికి నీవు హాజరు కావలసినదని మనఃపూర్వకముగా నిన్నాహ్వానించుచున్నాము.

మాకు బైబిలు తప్ప వేరొక గ్రంధము లేదు, క్రీస్తు తప్ప వేరొక విశ్వాసప్రమాణము లేదు, దేవుని నామము తప్ప వేరొక నామములేదు., సువార్త తప్ప వేరొక విజ్ఞాపన లేదు, రక్షించుటకే తప్ప వేరొక గురిలేదు. క్రీస్తులో ఐక్యత, భావములలో స్వాతంత్ర్యత, అన్ని విషయములలో ప్రేమయే మాలక్ష్యము.

- మేక్ లేటన్.

## ఒకడు ఎలా రక్షించబడగలడు?

( How can one be Saved ? )

ఈ లోకము పాపమనే ఘోరమైన వ్యాధితో నిండివుంది. ప్రతి ఒక్కరు పాపమునకు దాసులై జీవిస్తున్నారు. మంచి, చెడుకి వ్యత్యాసం తెలియక తికమక పడుతు, పాపములో పాలు పంచుకుంటు చుక్కాలేని నావలా, నిరాశ, నిశ్పృహలతో వ్యధ చెందుచున్నారు. భారమైన బ్రతుకులో, ఆధారంలేని గాలిపటంలా, ఆశ నిరాశల పోరాటంతో పాపమనే హాలాహలాన్ని మ్రింగుతు అవస్థపడుతు అలమటి స్తున్నారు. వీరు పాపమనే జబ్బుతో మూలుగుతున్నారు. వీరికి ఆ జబ్బునుండి విముక్తి కావాలి. ఆ విముక్తి ఎలా వస్తుంది ? వీరికున్న జబ్బు పాపమనే ఆత్మీయ రోగం కావున, శారీరక సబంధమైన వైద్యులు ఈ రోగమును పోగొట్టలేరు. అందు చేతనే క్రీస్తు ఈలోకమునకు వచ్చాడు. "పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెనని" 1తిమోతి 1:15, "పాపులను పిలచుటకు ఆయన వచ్చెనని" మత్తయి9:13 చెప్పుచున్నది. "రోగులకేగాని ఆరోగ్యము గలవారికి

వైద్యుడక్కరలేదు గదా!" కాబట్టి నీవు పాపమునుండి రక్షింపబడుట అవసరం. "అందరును పాపముచేసి, దేవుడను(గహించు మహిమను పొందలేకపోవు చున్నారు" (రోమా 3:23).

"నేను ఏ పాపమును చెయ్యలేదు" అని నీవనుకొనవచ్చు కాని "మనము పాపము చేయలేదని చెప్పుకొనిన యెడల ఆయనను అబద్ధికునిగా చేయువార మగుదుము" (1యోహాను 1:10). "మనమందరము అపవి(తులవంటి వారమైతిమి. మన నీతి (క్రియలన్నియు మురికి గుడ్డలవలె నాయెను" అని యెషయా 64:6లో చూడగలము. దీనికంతకు కారణం మన హృదయ తలంపులు మా(తమే. అందుకే యిర్మీయా ఇలా చెప్పుచున్నాడు: "నా హృదయము అన్నిటికంటె మోసకరమైనది. అది ఘోరమైన వ్యాదికలది. దానిని (గహింపగలవాడెవడు" (యిర్మీయా 17:9). అందుకే "మనమందరము గొఱ్ఱెలవలె (తోవతప్పిపోతిమి. మనలో (పతివాడును, తన కిష్టమైన (తోవకు తొలిగెను" (యెషయా 53:6). అని (వ్రాయబడి యున్నది.

## నిన్ను నీవే రక్షించుకోలేవు

పాపములో జీవిస్తున్న మనకు, మన పాపములు పోవలెనంటే పాపములేని వ్యక్తి వచ్చి మన పాపములను తీసివెయ్యాలి. అందుకే (పభువైన (క్రీస్తు ఇలా చెప్పు చున్నాడు: "నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను. నాద్వారానే తప్ప, ఎవడును తం(డ్రి యొద్దకు రాడు" (యోహాను 14:6). అదియే కాకుండ, "మరి ఎవని వలనను రక్షణ కలుగదు. ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని ఆకాశము (క్రింద, మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అపో.కా. 4:12). కాబట్టి "నిన్ను నీవు ఎప్పుడో రక్షించుకొనలేవు. నీవు అపాయంలో వున్నట్లయితే, ఎవరో ఒకరి సహాయం లేనిదే, నీవు ఆ అపాయంనుండి రక్షించబడ[illegible]. అలాగే నీవు పాపములో జీవిస్తున్నప్పుడు, నీ పాపములు పోవాలంటే, నీ పాపములను నీవు తీసుకొనలేవు.

## యేసు నీకొరకు రక్షణ సిద్ధపరచి యున్నాడు

ఎవడును పాపములోపడి నశింపవలెనని ఇష్టములేక అందరూ రక్షణ పొందవలెనని, మన యెడల ప్రభువు దీర్ఘశాంతము గలవాడై యున్నాడు (2పేతురు 3:9). అందుకే "మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను (యేసును) మనకోసరము పాపముగా చేసెను" అని పరిశుద్ధగ్రంథం చెప్పుచున్నది (2కొరింథీ 5:21). ఎందుకనగా "పాపములో ఉన్న మనలను దేవుని యొద్దకు తెచ్చుటకు అనీతిమంతుల కొరకు, నీతిమంతుడైన క్రీస్తు, శరీర విషయములలో చంపబడియు ఆత్మ విషయములో బ్రదికింపబడి, పాపముల విషయములో ఒక్కసారే శ్రమపడెను" (1పేతురు 3:18).

## ప్రభువైన క్రీస్తు రక్షించుటకు, కాపాడుటకు సమర్థుడు

కావున "భక్తులకు శోధనలో నుండి తప్పించుటకును, దుర్నీతి పరులను ముఖ్యముగా మలినమైన దురాశ కలిగి శరీరానుసారముగా నడుచుకొనుచు, ప్రభుత్వమును నిరాకరించుచు, శిక్షలో ఉంచబడిన వారిని తీర్పు దినమువరకు కావలిలో ఉంచుటకును ప్రభువు సమర్థుడు" అని 2పేతురు 2:9 చెప్పుచున్నది. కనుక "తాను శోధింపబడి శ్రమపొందెను గనుక శోధింపబడువారికిని సహాయము చేయుగలవాడై యున్నాడు" (హెబ్రీ 2:18). "ఈయన ద్వారా దేవుని వద్దకు వచ్చువారి పక్షమున విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు. గనుక వారిని సంపూర్ణముగా రక్షించుటకు శక్తిమంతుడై యున్నాడు" (హెబ్రీ 7:25).

## నీవు చేయవలసినది

కావున , ప్రియ చదువరీ! నీవింకను పాపములో జీవిస్తున్న యెడల పాపము నుండి రక్షణపొందాలంటే, దేవునియొక్క వాక్యమును వినవలెను. "కాగా వినుటవలన విశ్వాసము కలుగును. వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" (రోమా 10:17). నీవు విశ్వాసము ఉంచవలెను. "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము. దేవునియొద్దకు వచ్చువాడు ఆయన ఉన్నాడనియు,

తన్ను వెదుకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను" (హెబ్రీ 11:6). నీవు దేవునియందు, దేవుని కుమారుడైన క్రీస్తునందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందాలి. "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను. ఇప్పుడైతే అంతటను, అందరును మారుమనస్సు పొంద వలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపో.కా. 17:30).

"కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమునుగూర్చి ఆలస్యము చేయువాడు కాడుగాని, ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు మీ యెడల దీర్ఘశాంతముగలవాడై యున్నాడు (2పేతురు 3:9). "గనుక నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి, ఆయన నామమును బట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగి వేసుకొనుమని" పరిశుద్ధగ్రంధమైన బైబిలు చెప్పుచున్నది (అపో.కా.26:16). కావున, నీవు విన్న వాక్యమునందు విశ్వాసముంచి, మారుమనస్సు పొంది "యేసు సజీవుడగు దేవుని కుమారుడని ఒప్పుకోవలెను" (మత్తయి 16:16). "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో, పరలోకమందున్న నా తండ్రి యెదుటనేనును, వానిని ఒప్పుకొందునని" ప్రభువైన క్రీస్తు చెప్పుచున్నాడు (మత్తయి 10:32). కనుక, "యేసు-ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షించబడుదువు.; ఏలయనగా "నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును. రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10:9-10). అటు తరువాత నీవు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెను. ఏలయనగా "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించ బడును" అని యేసుక్రీస్తు చెప్పెను (మార్కు 16:16).

కాబట్టి ప్రియ చదువరీ! నీవింకను బాప్తిస్మము పొందని యెడల, నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి, క్రీస్తు నామమున బాప్తిస్మము పొంది, నీ పాపములను కడిగివేసుకో, అప్పుడు నీవు రక్షించబడగలవు. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును. నమ్మనివానికి శిక్ష విధించబడును" (మార్కు 16:16).

# మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" అను మా రేడియో కార్యక్రమము ద్వారా మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకములు మావద్ద కలవు. మీరు కేవలము 25/- రూ॥లు ఈ క్రింది అడ్రసుకు M.O. చేసినచో 100/- రూ॥లకు మిం[illegible]లువగల 15నుండి 20 రకముల పుస్తకములు మరియు 2 సంవత్సరముల వరకు " సత్యవాక్కు" అను మాసపత్రికను మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి. మీ ఇంటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంధాలయము తెరవండి. మావద్ద లభించు పుస్తకముల రేట్ల వివరములు పోస్టేజితో సహా:

| | | రూ.-పై. |
|---|---|---|
| 1. | తెలుగు బైబిలు | 55-00 |
| 2. | పెద్ద అచ్చు బైబిలు | 110-00 |
| 3. | రిఫరెన్సు బైబిలు | 75-00 |
| 4. | 15నుండి 20 మంచి పుస్తకములు మరియు 2 సంవత్సరముల పాటు సత్యవాక్కు మాసపత్రిక ఉచితం | 25-00 |

గమనిక : మీరు పంపు పైకము M.O. ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుచున్నారో కూడా వ్రాయండి.


**SATYA VANI**

**Sambamurthi Street, Ramaraopet**

**Kakinada - 533 004.**

ఊపిరితిత్తుల బాధతో బాధింపబడ్డారు. ఎన్ని శ్రమలు వచ్చినా, క్రీస్తు కొరకు నిరంతరం పనిచేసిన సోదరి ఆమె. ఆమె విడిచి వెళ్ళిన భర్త పెర్రికోతమ్ గారి కొరకు వారి బిడ్డల కొరకు ప్రార్థించమనవి.

శీతాకాల సెలవుల అనంతరం కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ మరల జనవరి 16న తెరువబడినది. ఇంచుమించు 70 మంది విద్యార్థులు అక్కడ బోధకులుగా తర్ఫీదు పొందుచున్నారు.

సత్యవాణి సంగీతమాలికల పాటల కేసెట్లు ఇప్పుడు కాకినాడలో లభ్యమగుచున్నవి. 40 నిమిషాల వ్యవధిగల ఒక్కో కేసెట్టులోను 13 చక్కని పాత క్రొత్త భక్తిగీతములున్నాయి. మొత్తం రెండు కేసెట్లలోను 27 పాటలున్నాయి. వాటి ఖరీదు ఒక్కొక్కటి పోస్టేజితో సహా 35/-రూ॥లు. రెండుకేసెట్లకు 70/-రూ॥లు సత్యవాణికి పంపవలెను. వ్యక్తిగతముగా వచ్చి తీసికొనిన యెడల ఒక్కొక్క కేసెట్ 25/-రూ॥లకే సత్యవాణి ఆఫీసులో లభ్యమగుచున్నవి. ఇప్పుడు బేసిక్ బైబిలు కోర్సు తెలుగు, ఒరియా, ఇంగ్లీషు భాషలలో లభ్యమగుచున్నది. దానిని జయప్రదముగా పూర్తిచేసిన వారికి యోగ్యతా పత్రముతో బాటు ఆయా భాషలలో బైబిలు కూడ బహుమతిగా ఇయ్యబడుచున్నది.

---

**PRINTED BOOK - BOOK POST**

**From:**
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA - 533 001

**To**